క్లుప్తంగా

సైనిక్‌స్కూల్‌కు అర్హత




గౌతంకృష్ణ అంబేడ్కర్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సన్ షైన్ స్కూల్లో చదువుతున్న అంబేడ్కర్, గౌతం కృష్ణ ఇద్దరు విద్యార్థులు సైనిక్‌స్కూల్‌కు అర్హత సాధించారు. గురువారం విడుదలైన ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి సైనిక్ స్కూల్ ప్రవేశం కోసం అర్హత సాధించారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్, పాఠశాల యాజమాన్య బృందం గణేశ్, సంజయ్, రాకేశ్‌లు విద్యార్థులను అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో శిక్షణకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. 2025–26 సెషన్ సీఏటీఎస్ శిక్షణ పొందడానికి ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. డిగ్రీ, డిప్లొమో, ఎన్‌టీసీలో ఏదైనా ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 16 ఏళ్లు నిండి ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల వసతి గృహంలో నిర్వహిస్తున్న మావల కేజీబీవీలో 6, 7, 8వ తరగతులకు అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రత్యేక అధికారి ఎస్. సువర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో తరగతులు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 83099 56612పై సంప్రదించాలని కోరారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈవో శ్రీకాంత్

తాంసి: ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో భాగంగా శిక్షణ పొందుతున్న ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శ్రీకాంత్ సూచించారు. ఐదు రోజుల శిక్షణలో భాగంగా తాంసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఎంఈవో శ్రీకాంత్ పరిశీలించారు. శిక్షణ కేంద్రంలో ఉపాధ్యాయులతో మాట్లాడి పలు రకాల సూచనలు చేశారు. ఎంఆర్‌పీలు గంభీర్, శ్రీనివాస్, పొచ్చన్న, సుధాకర్ సిబ్బంది ఉన్నారు.

ఆవులను వధించకుండా చూడాలి



వినతిపత్రం అందజేస్తున్న నారాయణ

తలమడుగు: బక్రీద్ రోజు ఆవులను వధించకుండా చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బోండ్ల నారాయణ కోరారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాబోయే బక్రీద్ పండుగ రోజున ఆవులను వధించకుండా చూడాలన్నారు. గోవులను సంరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దాదాజీ కిరణ్, పురుషోత్తం ఉన్నారు.

డీఐఈవోకు వినతి

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం డీఐఈవో జాదవ్ గణేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ న్యాయబద్ధంగా రావాల్సిన వార్షిక ఇంక్రిమెంట్‌లో జాప్యం జరగకుండా చూడాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు ఇంక్రిమెంట్ విడుదల చేశారని, జిల్లాలో దాదాపు 120 మంది లెక్చరర్లు లబ్ధి పొందనున్నారన్నారు. సంఘం నాయకులు రమాదేవి, ప్రభావతి, శ్రీనివాస్, మహేశ్, ప్రవీణ్, రవికాంత్, తిరుపతి రెడ్డి తదితరులు ఉన్నారు.

'హరీశ్‌రావు క్షమాపణ చెప్పాలి'

బోథ్: అకాల వర్షాల వల్ల వ్యవసాయ మార్కెట్ యార్డులలో కష్టాల పాలవుతున్న రైతులకు తెలంగాణ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీల బడ్జెట్‌ను అప్పటి మంత్రి హరీశ్‌రావు తన నియోజకవర్గం అభివృద్ధికి మళ్లించాడని విమర్శించారు.

చెరువు గండి పూడ్చేదెప్పుడో..!

- మూడేళ్ల క్రితం తెగినా పట్టించుకునే వారు లేరు
- నిరుపయోగంగా మారుతున్న చెరువు



చెరువుకు పడిన గండి

సిరికొండ: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ చెరువుకు గండి పడి మూడేళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. చెరువుకు గండి పడడంతో చెరువులో చుక్క వరద నీరు ఆగక చెరువుతో ఎలాంటి ఉపయోగం లేకుండా పోతోంది. గ్రామంలోని పంటలకు సాగు నీరు అందించాలన్నా, భూగర్భ జలాలు పెరగాలన్నా ఆ చెరువు ఒక్కటే గ్రామస్తులకు ఆధారం.

గండి పడి మూడేళ్లు..

మండలంలోని లక్ష్మీపూర్ (బి) గ్రామానికి సమీపంలో ఉన్న చెరువు గ్రామానికి ఎంతో ఉపయోగకరంగా ఉండేది. చెరువు కింద సుమారు 800 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు చెరువులో నిల్వ ఉండేది. రబీ పంటల సాగు సమయంలో ఈ చెరువులోని నీటిని వినియోగించేవారు. కానీ మూడు సంవత్సరాల క్రితం వచ్చిన భారీ వరదలతో చెరువులో భారీగా నీరు చేరి గండి పడింది. దీంతో చెరువులోని వరద నీరంతా దిగువన ఉన్న పంట చేలలోకి చేరి పంటలు పూర్తిగా నీట మునిగాయి.

పూడ్చని గండి..

గత మూడేళ్ల క్రితం పడిన చెరువు గండితో చెరువు కింద సాగు భూముల్లో వరద నీరు చేరింది. ఈ వ్యవసాయ భూముల్లో ఇసుక, మట్టి చేరడంతో పంటలు సాగు చేసుకుంటున్నా రైతులకు దిగుబడి అంతంత మాత్రంగానే వస్తోంది. మూడేళ్ల క్రితం పడిన చెరువు గండి ఇప్పటికీ పూడ్చలేదు. చెరువుకు గండి పడడంతో చెరువులో నీరు నిల్వ లేకపోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా ఇంకి పోతున్నాయి. దీంతో చేతిపంపుల్లో నీరు రావడం లేదని ఒక్క లక్ష్మీపూర్‌లోనే కాకుండా చెరువుకు దిగువన ఉన్న సాత్‌మోరి, తిమ్మాపూర్ గ్రామాల్లో కూడ భూగర్భ జలాలు ఇంకిపోయాయి. గండిని పూడ్చాలని ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా చెరువు వైపు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుకు పడిన గండిని త్వరగా పూడ్చి తిరిగి చెరువుకు పూర్వం వైభవం తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

దిగుబడి రావడం లేదు



నాకు చెరువు కింద 2 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. చెరువుకు గండి పడకముందు నాకు మంచి దిగుబడి వచ్చేది. కానీ చెరువుకు గండి పడటంతో ప్రతీ ఏడాది వరద నీరు పంట చేలలోకి వచ్చి చేరుతోంది. దీంతో పంట ఎదుగుదల లేక పంట దిగుబడి రావడం లేదు.

– పెందుర్ అమృత్‌రావు, రైతు

ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి



మా గ్రామంలో ఉన్న చెరువుకు గండి పడి మూడేళ్లు అవుతోంది. ఇప్పటి వరకు కూడ ప్రజాప్రతినిధులు మా చెరువును పట్టించుకోలేదు. ఇప్పటికైనా చెరువు దుస్థితిని చూసి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలి.

– మారుతి, గ్రామస్తుడు

ఎన్నోసార్లు విన్నవించాం..



మా గ్రామంలోని చెరువుకు భారీ గండి పడటంతో వరద నీరు నిల్వ లేకుండా పంట పొలంలోకి వచ్చి చేరుతోంది. దీంతో గ్రామ రైతులు మా వద్దకు వచ్చి మొర పెట్టుకుంటున్నారు. ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు విన్నవించాం.

– పెందుర్ నర్మద, మాజీ సర్పంచ్

టీబీ రహిత సమాజానికి కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: ప్రతీ ఒక్కరు క్షయ వ్యాధి నివారణకు కృషి చేయాలని, వ్యాధి సోకిన వారు తగిన జాగ్రత్తలు పాటించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో వైద్య శాఖ సిబ్బందితో కలిసి టీబీ ముక్త్ భారత్‌కు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి ఓ అంటువ్యాధి అని ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధిని అరికట్టవచ్చన్నారు. వ్యాధి సోకిన వారికి రూ. 1000తో పాటు ఉచిత నిత్యవసర సరుకులు, గిరిజనులకు ప్రత్యేకంగా ప్రయాణ ఖర్చుల నిమిత్తం రూ. 750 అందిస్తున్నాయన్నారు. జిల్లా టీబీ కంట్రోలర్ అధికారిణి సుమలత, జిల్లా టీబీ కోఆర్డినేటర్ సుదర్శన్, వెంకటేశ్వర్, అంబారావు, వేణు తదితరులు ఉన్నారు. అనంతరం ఇంద్రవెల్లి మండలం వాల్గొండ గ్రామానికి చెందిన పెందూర్ గంగారాం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా రూ.5 వేలు ఆర్థికసాయం చేశారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం..

విద్యార్థులు ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ప్రాథమిక దశలో నాణ్యమైన విద్య అందినప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. మండలంలోని లక్కారంలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 5రోజుల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇటీవల సివిల్స్ ఫలితాల్లో సత్తా చాటిన సాయిచైతన్య తల్లిని సత్కరించారు. ఎంఈవో ఆవన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరడిగొండ: టీబీ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెచ్ఈవో పవార్ రవీందర్ అన్నారు. నిక్షయ్ శివిర్‌లో భాగంగా శుక్రవారం మండలంలోని బుద్ధి కొండ గ్రామంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ మ హమ్మారి ఒకరి నుంచి మరొకరికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుందని పేర్కొన్నారు. టీబీ వ్యా ధితో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఆశ కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న గ్రామస్తులు

బోథ్: మండలంలోని రెండ్లపల్లి గ్రామంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పండితుల మంత్రోచ్చారణల మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించి మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ సురేందర్, బీఆర్ఎస్ రైతు మండల సంఘం అధ్యక్షుడు బోడ్డు శ్రీనివాస్, బోథ్ పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, మాజీ మార్కెట్ డైరెక్టర్ గంగారాం, మనోహర్, బాపురావు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన అభ్యంగ్‌వార్ సాయిరాం అనే యువకుడు ఈ నెల 5న ఇంటి నుంచి పనికోసం బయటకు వెళ్లాడు. రాత్రి వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఇదివరకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు పది రోజుల తర్వాత తిరిగి వచ్చాడు. ఈసారి వేచి చూసిన కుటుంబసభ్యులు ఆచూకీ ఎంతకూ లభించలేదు. యువకుడి తల్లి సంగీత వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

దివ్యాంగులకు డిస్కౌంట్ మేళా

ఇచ్చోడ: ఈ నెల 27న మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో దివ్యాంగుల కోసం ఆర్టీసీ ఆధ్వర్యంలో డిస్కౌంట్ మేళా నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ ఆర్టీసీ డీఎం ప్రతిమా రెడ్డి తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో బస్సు పాసులు తీసుకున్న దివ్యాంగులు రూ.50 చెల్లించి పాసులను రెన్యువల్ చేసుకోవాలని కోరారు. పాసులు లేని దివ్యాంగులు ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, పాస్‌ఫోటోలతో మేళాకు హాజరు కావాలని కోరారు. దివ్యాంగుల కోసం ఆర్టీసీ రాయితీలపై బస్సు పాసులు ఇస్తుందని తెలిపారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

భీంపూర్: మండలంలోని వడేగాం, గిరిగాం గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం శుక్రవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రాజేందర్ రెడ్డి, డాక్టర్ రఘువీర్, డాక్టర్ అనిల్ కుమార్ రైతులతో సమావేశమై మాట్లాడారు. వ్యవసాయ అధికారి శ్రీనివాస రెడ్డి, ఏఈఓ వెంకటేష్, రైతులు ఉన్నారు.

మందుబాబుల ఇష్టారాజ్యం!



వైన్స్ వద్ద మద్యం సేవిస్తున్న మందుబాబులు

జైనథ్: మండలకేంద్రంలోని వైన్స్ వద్ద పర్మిట్ రూం లేకపోవడంతో మందుబాబులు విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ మద్యం సేవిస్తున్నారు. వైన్స్‌ను ఆనుకుని ఉండే రోడ్డుపైనే బైటాయించి దర్జాగా మందు తాగుతున్నారు. నిబంధనల ప్రకారం ప్రతీ వైన్స్ వద్ద పర్మిట్ రూం ఏర్పాటు చేయాలి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు పలు మండల కేంద్రాల్లోనూ వైన్స్‌ల వద్ద పర్మిట్ రూంలు ఉన్నాయి. జైనథ్ మండల కేంద్రంలోని వైన్స్ వద్ద మాత్రం నిర్వాహకులు పర్మిట్‌రూమ్ ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో అక్కడ మద్యాన్ని కొనుగోలు చేసిన మందుబాబులు రోడ్లు, పంట చేలల్లో మందు తాగుతున్నారు. ఖాళీ మద్యం సీసాలు, గ్లాసులు, వాటర్ ప్యాకెట్లను అక్కడే వదిలేస్తుండటంతో పరిసరాలు చెత్తాచెదారంతో నిండి దుర్గంధంగా మారుతున్నాయి. బయట ప్రాంతాల్లో మద్యం తాగే వారిపై పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు దీనిపై స్పందించి మందుబాబుల ఆగడాలకు చెక్‌పెట్టాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

ఇంటికే రోడ్డు..!



ఇంద్రవెల్లి: ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంలో మంజూరైన నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ లోపంతో గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని గౌరపూర్ గ్రామపంచాయతీ పరిధి మోహన్‌సింగ్‌తండా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తనకున్న పలుకుబడితో తన ఇంటి గేటు లోపలి వరకు సీసీరోడ్డు వేయించుకున్నాడు. దీంతో గ్రామస్తులు అధికారులపై మండిపడుతున్నారు. అధికారులు అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి నిధులు పక్కదారి పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలను పునఃప్రారంభిస్తాం



మాట్లాడుతున్న ఎంఈవో పవార్ అనిత

నార్నూర్: మండలంలోని భీంపూర్ ఎస్సీగూడ గ్రామంలో ఉన్న ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలను వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పునః ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని ఎంఈవో పవార్ అనిత అన్నారు. శుక్రవారం భీంపూర్ ఎస్సీగూడ గ్రామాన్ని ఆమె సందర్శించారు. గతంలో పాఠశాల మూతపడడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో విద్యార్థుల సంఖ్యపై ఆరా తీశారు. ఉపాధ్యాయుడు రాథోడ్ అశ్విన్ తదితరులు ఉన్నారు.

జొన్నల కొనుగోలు బాధ్యత నాది

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



కొనుగోలు కేంద్రంలో జొన్నపంట పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

జైనథ్: జొన్న రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వంతో మాట్లాడి రైతులు పండించిన జొన్నలను కొనుగోలు చేయించే బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను శుక్రవారం సందర్శించారు. అమ్మకాల కోసం తెచ్చిన జొన్నపంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడి భరోసా కల్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట విక్రయానికి రైతులు ఐదారు రోజులు మార్కెట్‌లోనే వేచి చూడాల్సిన పరిస్థితి ఉండటం బాధాకరమన్నారు. వర్షంతో జొన్నలు తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. అక్రమంగా మహారాష్ట్ర నుంచి జొన్నలు తీసుకొచ్చిన వివరాలను పోలీసులకు తెలియజేయాలన్నారు. అనంతరం పాయల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో ఎమ్మెల్యే స్వయంగా రైతులకు భోజనం వడ్డించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, నాయకులు అశోక్ రెడ్డి, పెద్ద లక్ష్మణ్ యాదవ్, సామ రమేశ్ రెడ్డి, తిప్పిరెడ్డి రాకేశ్ రెడ్డి, సుభాశ్ యాదవ్, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ప్రతీగింజను కొనుగోలు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: అకాల వర్షాల కారణంగా తడిసిన ప్రతీ గింజను ప్రభుత్వం బేషరతుగా కొనుగోలు చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో నియోజకవర్గంలో అనేక మంది రైతులు పండించిన జొన్న పంట తడిసి ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. జొన్నలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. వివిధ ఆరోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొంది సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన చెక్కులను శుక్రవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో అందజేశారు. మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన దూల రాజవ్వకు రూ.14,500, బజార్‌హత్నూర్ మండలం దేగామ గ్రామానికి చెందిన గాజుల సురేశ్‌కు రూ.33వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మాజీ ఎంపీపీలు ప్రీతం రెడ్డి, తుల శ్రీనివాస్, ఇచ్చోడ మండల కన్వీనర్ కృష్ణరెడ్డి, బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్, ఇచ్చోడ మాజీ ఉపసర్పంచ్ శిరీష్ రెడ్డి, తానాజీ, అల్లకొండ ప్రశాంత్, అడెల్లు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఏనుగు సరితకు రూ.3 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం అందజేశారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ లోక శిరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

గుడిహత్నూర్: మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఉన్న అతి పురాతన హనుమాన్ మందిరాన్ని రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించడానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఇచ్చిన హామీ ప్రకారం శిథిలావస్థకు చేరిన ఆలయ నిర్మాణానికి దేవాదాయ శాఖ ద్వారా రూ.50 లక్షలు మంజూరు చేయించి పనులు ప్రారంభించామన్నారు. అంతకు ముందు గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమల్ గౌడ్, నాయకులు జాదవ్ రమేశ్, రవీనాయక్ పవార్, వెంకట్‌రావ్ పోలే, శ్రీరంగ్ దేశ్‌కతే, కేశవ్ పోలే, త్రిముఖ్ పటేల్, వినోద్ ముర్కుటే, రవి కరాడ్ ఉన్నారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు



మరమ్మతులు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

తాంసి: గురువారం రాత్రి కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి మండలంలోని పొన్నారి శివారుతో పాటు ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని పొచ్చెర శివారులో 33 కేవీ విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో తాంసి మండలానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గాలివానకు పొన్నారి శివారులోని 33 కేవీ విద్యుత్ స్తంభం విరిగి చెట్టుపై పడింది. పొచ్చెర గ్రామ శివారులో మరో రెండు 33 కేవీ విద్యుత్ స్తంభాలు గాలివానకు కిందకి వంగిపోయాయి. పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. విద్యుత్‌శాఖ ఏఈ మనోజ్ సిబ్బందితో కలిసి ఉదయం విరిగిపడిన స్తంభాల వద్ద మరమ్మతులు చేపట్టి మధ్యాహ్నం 12 గంటలకు గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

భారీ వర్షం.. పంట నష్టం



జొన్న పంట పరిశీలిస్తున్న ఏఈవో దయానంద్



మాన్కాపూర్ గ్రామ శివారులో భారీ వర్షానికి నేలవాలిన జొన్న పంట

నార్నూర్: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీ కింద సాగు చేస్తున్న జొన్న పంటకు తీవ్ర నష్టం జరిగింది. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షంతో మండలంలోని మాన్కాపూర్, నార్నూర్, తాడిహత్నూర్, నాగల్‌కొండ, గంగాపూర్ గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోయారు. చేతికి వచ్చిన జొన్న పంట భారీ వర్షానికి తడిచిపోయింది. మాన్కాపూర్ గ్రామానికి చెందిన రైతు తొడసం సుంగు పొలంలో భారీగా వరద నీరు చేరి కోత కోసి నిల్వ చేసిన జొన్న పంట కొట్టుకుపోయింది. వర్షానికి దాదాపు 50 ఎకరాల్లో జొన్న పంటకు నష్టం వాటిల్లింది.

సంక్షిప్త వార్తలు

ఏఎన్ఎం కుటుంబానికి న్యాయం చేయాలి

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ వసతి గృహాలు, పాఠశాలల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలు అందరికి బీమా సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ అన్నారు. బోథ్ మండలం పోస్ట్‌మెట్రిక్ వసతిగృహంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఏఎన్ఎం గిరిజ కుటుంబానికి న్యాయం చేయాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరుతూ శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందించారు. సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఆశన్న, ఏఎన్ఎంలు కామేశ్వరి, జంగుబాయి, నర్మద, అశ్విని, రంభ, చిత్రకళ ఉన్నారు.

జొన్నల కొనుగోళ్లు నిలిపివేత

ఇచ్చోడ: ఈ నెల 25 వరకు జొన్నల కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జీ సతీశ్ తెలిపారు. మార్కెట్ యార్డులో జొన్నల నిల్వలు పేరుకుపోవడం, అకాల వర్షాలు కురుస్తున్నందున నిలిపివేసినట్లు తెలిపారు. తిరిగి ఈ నెల 26 నుంచి కొనుగోలు చేపట్టనున్నట్లు తెలిపారు.

పెళ్లికి చేయూత

నార్నూర్: మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన యువతి వివాహానికి శుక్రవారం మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ ఆర్థిక సాయం అందించారు. నూతన వస్త్రాలతో పాటు రూ.5 వేలు అందజేసినట్లు తెలిపారు. ఆయన వెంట దళిత రత్న అవార్డు గ్రహీత కొర్రెళ్ల మహేందర్ ఉన్నారు.